www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక
ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| శనివారం | 07-06-2025 |



## రెవెన్యూ మంత్రికి కృతజ్ఞతలు తెలియజేసిన ట్రెసా రాష్ట్ర కమిటీ

ఎన్నికల తిరుగు బదిలీలు చేపట్టాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల గౌరవ రెవెన్యూ మంత్రి గారిని ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి గారు ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి గారి ని ఉద్దేశించి "పట్టువదలని విక్రమార్కుడి వలే సాధించావని" పేర్కొంటూ అభినందించారు. త్వరలోనే బదిలీలు పూర్తవుతాయని, ప్రజలకు మేలైన సర్వీసులు అందించాలని పేర్కొనడం జరిగింది.

– వాస్తవం, హైదరాబాద్



# లోకల్ బలప్రదర్శన..!

## ఇంట గెలిచేందుకు తండ్లాట..!

### నియోజకవర్గాలన్నీ చుట్టి వస్తున్న కవిత..!

### నిజామాబాద్‌లో తన టీమ్ ఏర్పాటులో బిజీబిజీ..



**వాస్తవం ప్రతినిధి - నిజామాబాద్**

రచ్చ గెలిచేందుకు రచ్చ రచ్చ చేసిన కవిత.. ఇప్పుడు ఇంట గెలిచేందుకు తండ్లాడుతోంది. నిజామాబాద్ జిల్లాలో తన ఉనికినే లేకుండా చేసిన తన సొంత పార్టీ నేతలతో ఆమె తలపడుతోంది. వారి బాధితులనందరినీ ఏకం చేసి తనకో కొత్త టీమ్ ఏర్పాటు చేసుకుంటోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆమె పర్యటిస్తోంది. ఏదో ఒక పేరుతో. దైవదర్శనాల పర్యటనలతో. నిజామాబాద్ అర్బన్, బోధన్, ఆర్మూర్, రూరల్, బాల్కొండ నియోజకవర్గాల్లో ఆమెకు పట్టులేకుండా చేశారు. ఇప్పుడామె ఆజాదీ అయిపోయింది. ఎక్కడికైనా వెళ్లి.. తన వాళ్లను, తనను నమ్ముకున్నవాళ్లను, తనపై నమ్మకం ఉంచిన వారిని చేరదీస్తున్నది. తన ఓటమికి లోకల్ ఎమ్మెల్యేలే కారణమని ఆమె లేఖలో పేర్కొన్న తరువాత అందరికీ అర్థమైపోయింది. ఇక ఆమె తాజా మాజీలతో పోరుకు రెడీ అయ్యిందని. తన దారి తను చూసుకుంటున్నదని. అందుకే వారి మీద కోపంతో ఉన్న వారంతా ఇప్పుడు కవిత పంచన చేరుతున్నారు. బాహాటంగానే వారు కూడా ఆమెను కలిసి ఫోటోలు దిగుతున్నారు. ఫ్లెక్సీలు పెడుతున్నారు. మొత్తం నిజామాబాద్ జిల్లాను ఆమె చుట్టేసి ఇంట గెలవాలని తపన పడుతోంది. మొన్నటి వరకు లోకల్ తాజా మాజీలతో ఉన్న ప్రచ్ఛన్న యుద్ధం .. ఇప్పుడు బాహాటంగానే కొనసాగనుంది. ఇప్పుడు కవిత లోకల్ బలప్రదర్శనలో, తన టీమ్ ఏర్పాటులో బిజీబిజీగా ఉన్నది.



**కా**ళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్ తప్పేమీ లేదన్నట్లుగా, అంతా కేబినెట్ నిర్ణయం మేరకే జరిగిందని ఈటెల రాజేందర్ బుకాయిస్తున్నారని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆర్థిక మంత్రిగా ఉన్న వ్యక్తి ప్రాజెక్టు నిధులతో తనకు సంబంధమే లేదని అనడం హాస్యాస్పదమని వ్యాఖ్యలు చేశారు. దేశమంతా కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని కోడై కూసిందన్నారు.

# కేసీఆర్ కోసం కాళేశ్వరంపై కాకమ్మ కబుర్లు...!

- అవినీతి జరగలేదన్నట్లుగా వ్యాఖ్యలు
- కెసిఆర్‌తో కుమ్మక్కయినట్లు స్పష్టం
- మండిపడ్డ పీసీసీ చీఫ్ హేష్ కుమార్ గౌడ్

**వాస్తవం, హైదరాబాద్:**

కాళేశ్వరం కమిషన్ విచారణ అనంతరం బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి సంబంధించి విచారణ అనంతరం ఈటెల వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని... వేల కోట్ల అవినీతి జరిగిందంటూ గతంలో అనేక సార్లు ప్రధాని సహా పలువురు ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. కానీ ఈటెల అందుకు భిన్నంగా ఈరోజు కమిషన్ ఎదుట ఇచ్చిన వివరణను చూస్తే కేసీఆర్‌తో కుమ్మక్కయినట్లు స్పష్టమైందన్నారు. కాళేశ్వరంలో ఈటెలకు కూడా వాటాలు ముట్టినందునే కేసీఆర్‌కు అనుకూలంగా మాట్లాడారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం అవినీతిపై పల్లెత్తు మాట కూడా విచారణ కమిషన్ ఎదుట ఎందుకు చెప్పలేదని ఈటెలను ప్రశ్నించారు. ప్రజలు, రైతుల నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలను పెంచినట్లు ఈటెల చెప్పడం చూస్తుంటే ఆశ్చర్యమేస్తోందన్నారు. ఈటెల ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లుందని అన్నారు. కేసీఆర్‌ను కాపాడేందుకు పూర్తిగా వకాల్తా పుచ్చుకుని వివరణ ఇచ్చినట్లు ఎంపీ మాటల ద్వారా కన్పిస్తోందన్నారు. పక్కా ప్రీ ప్లాలాన్ ప్రకారం కేసీఆర్, హరీష్ రావు, ఈటెల కూడబలుక్కుని ఒక్కటే సమాధానాలు చెప్పాలని, అవినీతి జరగలేదని బుకాయించేందుకు సిద్ధమై వచ్చి పచ్చి అబద్దాలు వల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈటెల వ్యాఖ్యలు చూస్తుంటే హరీష్ రావుతో ఆయన రహస్యంగా భేటీ అయ్యారని తాను చెప్పిన మాటలు నిజమని తేలిందన్నారు. టెక్నికల్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే ప్రాజెక్టు కట్టారని చెబుతున్నారన్నారు. బీఆర్ఎస్‌తో బీజేపీకి ఉన్న లోపాయికారి ఒప్పందం మేరకే కేసీఆర్‌ను కాపాడేందుకు ఈటెలతో వివరణ ఇప్పించారా అని నిలదీశారు.

# తొడగొట్టి... పట్టుబట్టి.. పడగొట్టి..

# గట్టి మేలు తలపెట్టి...!

## కేసీఆర్ దించినా.. సీఎం పీఠం ఎక్కిన..!

- నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ఏకైక కర్తవ్యం.. ఇంక కోరికలేమీ లేవు..!
- దయ్యాల దళ నాయకుడు.. బిడ్డె ప్రశ్నలకే సమాధానం చెప్పడం లేదు.. !
- పదేండ్లు దోచుకుతిన్నోళ్లు మమ్మల్ని ప్రశ్నించేంత వారయ్యారా..?
- ఆలేరులో బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి..



**వాస్తవం ప్రతినిధి - హైదరాబాద్:**

ఒక్కసారి కమిట్ అయితే అంతే. సేమ్ రేవంత్‌రెడ్డి లాగా. ఎట్లైనా కేసీఆర్‌ను సీఎం పీఠం దించాలనుకున్నాడు. పట్టుబట్టాడు. తొడగొట్టాడు. పగబట్టినట్టు మరీ వెంటాడి వేటాడి ఓడించి ఫామ్ హౌజ్‌కు పరిమితం చేశాడు. సీఎం పీఠం ఎక్కాడు. ఇగ ఇంతకు మించి కోరికలేవీ లేవన్నాడు తనకు రేవంత్‌రెడ్డి. అనుకున్నది సాధించాను. ఇక మిగిలిన కోరిక సీఎం హెూదాలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలపాలని. అంతే. అంతకు మించి పెద్దగా కోరికలేమీ లేవన్నాడు. పదేండ్లు అధికారంలో ఉండి మమ్మల్ని ప్రశ్నించే సీన్ బీఆరెస వాళ్లకు లేదన్న సీఎం.. బిడ్డె అడిగిన ప్రశ్నలకే ఆన్సర్ ఇవ్వక ముఖం చాటేసిన దయ్యాల నాయకుడు కేసీఆర్.. ఇక జనాలకేం సమాధానం చెబుతాడని బహిరంగ సభ సాక్షిగా నిలదీశాడు. ఆలేరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన-ప్రగతిబాట బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ చుట్టూ దయ్యాలు కాదు.. ఆ పార్టీనే దయ్యాల కొంప అన్నాడు. పాపం తగిలే కాళ్లు విరగొట్టుకుని ఫామ్‌హౌజ్‌లో పన్నాడని అన్నాడు. ఒక్క నోటీసుకే గజ్జుమంటుండు ఇక ముందుంది సినిమా అన్నట్టుగా సీఎం పరోక్షంగా వార్నింగ్ కూడా ఇచ్చేశాడు.


ఆ ఇంటి బిడ్డనే చుట్టూ దయ్యాలు ఉన్నాయని బయటపెట్టినా.. ఆ దయ్యాల నాయకుడు సమాధానం చెప్పడం లేదు...బీఆర్ఎస్ కాదు డీఆరెస్.. దెయ్యాల రాష్ట్ర సమితి ...ఈ కొరివి దెయ్యాలను తెలంగాణ పొలిమేరల వరకు తరిమికొట్టాలి..అని పిలుపునిచ్చాడు సీఎం.

# కరోనా కేసుల కలవరం..!

- కేరళలో అధిక కేసుల కలకలం..!!
- దేశంలో 5వేలు దాటిన కరోనా కేసులు

**వాస్తవం, న్యూఢిల్లీ:**

దేశంలో క్రమంగా మహమ్మారి కరోనా కేసులు పెరుగుతున్నాయి. తాజాగా ఇండియాలో కోవిడ్ కేసులు 5000 దాటాయి. గత 24 గంటల్లో కొత్తగా 500 కరోనా కేసులు, నాలుగు మరణాలు సంభవించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. దీంతో దేశవ్యాప్తంగా కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 5364కు చేరుకున్నాయి. అత్యధికంగా కేరళలో యాక్టివ్ కేసులు 1679కు చేరుకున్నాయి. తరువాత గుజరాత్ (615), పశ్చిమ బెంగాల్ (596), ఢిల్లీ(592) ఉన్నాయి. గత 24 గంటల్లో కేరళలో రెండు మరణాలు సంభవించగా, కర్ణాటక,



పంజాబ్‌లో ఒక్కొక్కరు మరణించారు. గత 24 గంటల్లో 764 మంది కరోనా బాధితులు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. కోవిడ్ కేసుల పెరుగుదల నేపథ్యంలో, ఆక్సిజన్, ఐసోలేషన్ పడకలు, వెంటిలేటర్లు, అవసరమైన మందుల లభ్యతను నిర్ధారించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలను ఆదేశించింది.

# జబ్బుపడ్డ కోడెలను వదిలి వెళ్తారు..!

- అవి చనిపోతే ఇంత రాద్ధాంతమా...!?
- మరోసారి మంత్రి కొండా సురేఖ వివాస్పద వ్యాఖ్యలు..!

**వాస్తవం, హైదరాబాద్:**

వేములవాడ కోడెల మృతిలో బిఆర్ఎస్ రాజకీయం చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బిఆర్ఎస్ నాయకులపై నిప్పులు చెరిగారు. దండుపాళ్యం బ్యాచ్‌లా ఇష్టారీతిలో పదేళ్లు రాష్ట్రాన్ని కెసిఆర్ కుటుంబం దోచుకుందని, కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి చెందుతుంటే విష పురుగులై అడ్డుపడుతున్నారని మంత్రి కొండా అన్నారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి కొండా సురేఖ ఓ ప్రకటన విడుదల చేశారు. రాజన్న కోడెలపై రాజకీయం చేయవద్దని, గడిచిన పదేళ్లలో వేములవాడ ఆలయానికి సంబంధించి ఏం చేశారని ఆమె ప్రశ్నించారు. ఘటనపై స్పందించి బాధ్యతాయుతంగా చర్యలు తీసుకున్నామని అయినా బురద రాజకీయాలు చేస్తూ బిఆర్ఎస్ నాయకులు దిగజారుతున్నారని ఆమె మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేసేముందు



పదేళ్ల దుర్మార్గ పాలనపై ఆత్మవిమర్శ చేసుకోవాలని ఆమె హితవుపలికారు. వేములవాడ రాజన్న ఆలయానికి కెసిఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్క పైసా కూడా ఇవ్వలేదని మంత్రి గుర్తు చేశారు. నేటి కోడెల దుస్థితికి కెసిఆర్ పాలనే కారణమని ఆమె ఆరోపించారు.